క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఫాతిమా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఇంగ్లిష్ మీడియం గ్రూపుల్లో 40 మంది చొప్పున చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 5నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండేడ్: విద్యుత్ మెయిన్ లైన్ మరమ్మతు కారణంగా మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ 11కేవీ సబ్‌స్టేషన్ రుసుంపల్లి ఫీడర్ పరిధిలోని పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, సాలార్‌నగర్, రుసుంపల్లి గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

జడ్చర్ల టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ జాగృతిసేన ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ అంటూ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించిందన్నారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి.. రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీ జాగృతిసేన నాయకులు నర్సింహులు, శేఖర్, గోపాల్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మల్లెపోగుకు డాక్టరేట్



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థి నాయకుడిగా, ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మల్లెపోగు శ్రీనివాస్ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు శనివారం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు కన్యాకుమారిలోని స్వామి వివేకానంద కేంద్ర హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డా.వెంకటేషన్, ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సంపత్‌కుమార్, సీబీఐ కోర్టు జడ్జి తిరుసీదా ప్రసాద్, ఐజీ ఆఫ్ పోలీస్ ఈ.మాసాన ముత్తు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తాను చేసిన సేవలను గుర్తించి గ్లోబల్ పీస్ యూనివర్సిటీ వారు సోషల్ సర్వీసెస్ విభాగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు అభినందన



కోయిల్‌కొండ: పదో తరగతి వార్షిక పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన కోయిల్‌కొండ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం ఎంఈఓ వెంకటాజీ అభినందించారు. విద్యార్థినులు శ్రావణి 528, భవాని 513 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారన్నారు. పాఠశాలలో 109 మంది విద్యార్థులకు గాను 107 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌కు పదోన్నతి


రాధాకృష్ణ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి (ఏబీసీడీఓ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కోయిల్‌కొండకు చెందిన రాధాకృష్ణకు పదోన్నతి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యం

మిడ్జిల్: మండలంలోని ఓ గ్రామంలో తల్లిదండ్రులతో కలిసి నివాసమంటున్న బాలిక (16) అదృశ్యమైంది. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు వివరాల మేరకు.. ఈ నెల 3న బాలిక ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాలిక కోసం తల్లిదండ్రులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తాం
- మన్యంకొండ క్షేత్రం అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


మన్యంకొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపనకు ఎడ్లబండిపై వస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మండలం మన్యంకొండలో శనివారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని.. ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేసి, 25లక్షల రైతు కుటుంబాలకు రుణవిముక్తి చేశామని వివరించారు. మన్యంకొండ క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆలయాభివృద్ధి కోసం రూ. 130కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు చేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు రైతులు ఘనస్వాగతం పలికారు. వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే ఎడ్లబండిపై వేదిక వద్దకు వచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎస్‌ఈ పీవీ రమేశ్, డీఈ (ఆపరేషన్) లక్ష్మణ్, తహసీల్దార్ సుందర్‌రాజ్, నాయకులు మల్లు అనిల్‌రెడ్డి, అనిల్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, బాలయ్య, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, రవికిరణ్, కురుమూర్తి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పీయూకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

■ పీయూలో జాతీయ రహదారి నిర్మాణం, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కొంత భూమి కోల్పోవడం జరిగిందని.. పీయూకు మరో ఐదెకరాలు భూమిని కేటాయించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఇంజినీరింగ్, లా కళాశాలల నిర్మాణానికి స్థలం అవసరం ఉందన్నారు. అదే విధంగా పీయూ విద్యార్థులు బస్సు కోసం నిలబడేందుకు బస్టాండ్ లేదని, ఇక్కడ బస్సులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పీయూ అధ్యక్షుడు రాము, గణేశ్, వంశీ, భద్రు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ


కొల్లూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

నవాబుపేట: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరిధాన్యం సేకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కొల్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మధ్యవర్తుల మాటలు నమ్మి రైతులను ఇబ్బందులు పెట్టరాదని, అలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలని తెలిపారు. తహసీల్దార్ వెంట డీటీ సువర్ణ, సిబ్బంది ఆంజనేయులు, వెంకటేశ్, నర్సింహులు ఉన్నారు.

■ నవాబుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి రమేశ్, డైరెక్టర్ శివకుమార్ ప్రారంభించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ అధికారులు రమాదేవి, లక్ష్మి, హేమలత, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, ఆంజనేయులు, వెంకటయ్య, సత్యం, నర్సింహులు, ఆనంద్, శ్రీనివాస్, నాగరాజ్, పెంటయ్య, నిరంజన్, సత్యం పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం



ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1947లో ఆవిర్భవించిన ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా నిలిచిందన్నారు. అసంఘటితరంగ సెక్టార్లు, బ్యాంకింగ్, ఎల్‌ఐసీ, పోస్టల్, బీఎస్‌ఎన్‌ఎల్ రంగాలతో పాటు అనేక ఫ్యాక్టరీల్లో అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకుని బలమైన సంఘంగా ఉద్భవించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రామ్మోహన్, ఆర్టీసీ సంఘం నాయకులు విజయబాబు, సాయిరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పృథ్వీసింగ్, ఎంఏ హలీం, చెన్నయ్య, కృష్ణకుమార్, శ్రీనివాసులు, సాంబశివుడు, సంతోష్‌కుమార్, సైదులు, ఆంజనేయులు, మనోహర్, అంజి, నాగరాజు, నర్సింహులు, విజయ్, సలీం, రాజు పాల్గొన్నారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్ల వాన


నాగారంలో నేలకొరిగిన వరిపంట


నేలరాలిన వరిగింజలు


పెద్దరాజమూర్‌లో కురిసిన వడగండ్లు

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట

దేవరకద్ర రూరల్: వడగండ్ల వాన రైతన్నకు కడగండ్లు మిగిల్చింది. అకాల వర్షంతో చేతికొచ్చిన వరిపంట పూర్తిగా దెబ్బతింది. దేవరకద్ర మండలంలోని బొల్లారం, అజిలాపూర్, నాగారం, చిన్నరాజమూర్, నార్లోనికుంట్ల, బస్వాపూర్, పెద్దరాజమూర్, గద్దెగూడెం తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురవడంతో వరిపైరు నేలకొరిగింది. గింజలన్నీ నేలపాలయ్యాయి. దీంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఒకట్రెండు రోజుల్లో కోత కోసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వడగండ్ల వాన పడి తీరని నష్టం మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, దెబ్బతిన్న పంటను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో పంటనష్టంపై సమాచారం ఇచ్చినా అధికారులు పరిశీలనకు రాలేదని రైతులు తెలిపారు. పెద్దమొత్తంలో పంట నష్టపోయినా క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని మాత రాజరాజేశ్వరిదేవి, షిర్డీ సాయిబాబా ఆలయాలకు వెళ్లే మార్గంలో శనివారం 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో కొన్ని నెలలుగా లోఓల్టేజీ సమస్య తలెత్తడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు లోఓల్టేజీ సమస్య తీరడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఏ తౌర్యానాయక్, టౌన్–3 ఏఈ అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయండి



మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు నుంచి ఇసుక తరలింపునకు అధికారులు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఇసుక అనుమతులను రద్దుచేయాలని గ్రామ రైతులు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. ఇసుక రవాణాతో భూగర్భజలాలు పడిపోతున్నాయని.. ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకుని ఇసుక అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

నారాయణపేట: పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. అంతకుముందు తనకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులచే డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయించి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే పేద విద్యార్థులకు ఆర్థికసాయం, ల్యాప్‌ట్యాప్‌ల అందజేత, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం, అనేక ఆలయాల పునర్నిర్మాణాలకు సహకరిస్తున్నారన్నారు. ఉద్యోగ మేళాలో 380 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా.. వారిలో 80 మందికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అంతకు ముందు నిర్వాహకులు వివిధ కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు, ఫౌండేషన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మణిమాల, వేణుగోపాల్, అంజయ్య, ఫౌండేషన్ సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్/అడ్డాకుల: కౌకుంట్ల మండలం రేకులంపల్లికి చెందిన బాల్‌రాజుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2లక్షల ఎల్‌ఓసీని శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అందజేశారు. ఆపత్కాలంలో ఆదుకున్న ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, పట్టణ అధ్యక్షుడు ప్రభు పాల్గొన్నారు.

■ మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన ఆరుగురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. బైకని మహేశ్‌కు రూ. 60వేలు, సాధిక బేగానికి రూ. 40వేలు, హర్ష వినయ్‌కుమార్‌కు రూ. 40,500, బైకని అంజమ్మకు రూ. 40వేలు, లక్ష్మమ్మకు రూ. 21,500, పెంటమ్మకు రూ.19,500 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రాములుయాదవ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలి


దేపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. శనివారం మండలంలోని దేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి.. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇదిలా ఉంటే, దేపల్లి గ్రామానికి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి 117 ఇళ్లను ప్రత్యేకంగా మంజూరు చేయించారు. అందులో దాదాపు 50శాతం ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండల అధికారులు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి.. లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపడితేనే బిల్లులు వస్తాయని వివరించారు. ఇళ్ల నిర్మాణంలో ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, సీసీ కాంచన, వెంకటేశ్, రాములు, రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి యువజన సేవా కళాసంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ సీతారామాంజనేయ గ్రంథాలయ ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'భారతదేశంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నా చిత్రం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సాహితి ప్రథమ, అభిలాష్ ద్వితీయ, జాన్విత తృతీయ స్థానాల్లో నిలవగా.. నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు నాయిని భాగన్నగౌడ్, పల్లెర్ల వెంకటేశ్వరరావు, జి.శివకుమార్, వేణుగోపాల్, శాంతి, నరేశ్, స్ఫూర్తి సామాజిక సేవా సంస్థ సభ్యులు ఏఎన్ గౌడ్, జేపీ మహేశ్‌కుమార్, నరేశ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 4.98లక్షలతో వసతుల కల్పన


వాటర్ కూలింగ్ మిషన్ ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాల కల్పన కోసం కలెక్టర్ విజయేందిర బోయి రూ. 4.98లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వాటర్ కూలింగ్ మిషన్, ఫ్రిజ్, 20 కుర్చీలు, 20 ఐవీ స్టాండ్లు, 3 వీల్‌చైర్లు, 5 స్ట్రెచర్లు, 2 కంప్యూటర్లు, ప్రింటర్లు కొనుగోలు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చంద్రకళ తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, బంధువులకు చల్లటి తాగునీటిని అందించేందుకు గాను కూలింగ్ మిషన్‌ను శనివారం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిరంతరాయంగా రోగులకు చల్లని నీటిని అందిస్తామన్నారు. రోగులకు సంబంధించిన మందులు భద్రపరిచేందుకు ఫ్రిజ్ వినియోగిస్తామన్నారు. రోగులు, వారి అటెండెంట్స్ కూర్చునేందుకు వీలుగా మూడు సీట్ల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇబ్బందికర రోగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లు వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం


కోడ్గల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

జడ్చర్ల/చిన్నచింతకుంట: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జడ్చర్ల మండలం కోడ్గల్, మిడ్జిల్ మండలం వస్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో వేసవి హ్యాండ్ బాల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసక్తిగల క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు రాంరెడ్డి, శంకర్ నాయక్, కోచ్‌లు సరోజ, అభిలాష్ పాల్గొన్నారు.

■ చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం ఉదయభాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రాయడం, చదవడం వంటి వాటితో పాటు కథలు, పద్యాలు, పాటలు, చిత్రలేఖనం, కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వసంత, సమియొద్దీన్, సీఆర్పీ ప్రవీణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు


జిల్లా కేంద్రంలో సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జడ్చర్ల టౌన్: సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఏఓ ఉమాకాంత్‌కు నోటీసు అందజేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనను విజయవంతం చేసేందుకు ఆ రోజు విధులకు హాజరు కాబోమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లె గోపాల్, ఎర్ర నర్సింహులు, రాజ్‌కుమార్, బాలరాజు, నర్సింహ, కేశవులు, వీరప్ప, హనుమంతు, యాదమ్మ, నరసమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

■ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి.. నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ కార్యదర్శి కృష్ణ, బాసిత్, సాదిక్, అంజమ్మ, దేపల్లి రాజు, కరీం తదితరులు పాల్గొన్నారు.

5నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక తెలంగాణ చౌరస్తాలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 5నుంచి 7వ తేదీ వరకు ఆరాధన గురుపూజా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న స్వామివారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, గణపతిపూజ కార్యక్రమాలతో పాటు రెండు రోజుల భజన పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 6న గోవిందమాంబ సమేత శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన, రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న స్వామివారికి ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, పురాణ ప్రవచనాలు, మంగళవాయిద్యాలచే సంగీత కచేరీ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భజన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.